

అశ్వారావుపేట: బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే మెచ్చా



దమ్మపేట: పార్టీలో చేరిన యువకులతో ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

# మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వమే

**బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు**

అశ్వారావుపేట, నవంబర్ 1: అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచేది బీఆర్‌ఎస్ పార్టీయేనని, మళ్లీ సీఎం కేసీఆర్ నేతృత్వంలోనే ప్రభుత్వం ఏర్పడుతుందని బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ధీమాగా చెప్పారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి ఓట్లు అడిగితే అత్యధిక మెజారిటీ సాధ్యమవుతుందని పార్టీ శ్రేణులతో చెప్పారు. దమ్మపేట మండలం తాటిసుబ్బన్నగూడెంలోని ఎమ్మెల్యే నివాసంలో అశ్వారావుపేట, జమ్మిగూడెం గ్రామాలకు చెందిన కొందరు బుధవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి మెచ్చా నాగేశ్వరరావు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజాసంక్షేమానికే అధిక ప్రాధాన్యమిచ్చానని అన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ గెలిపిస్తే మరింతగా అభివృద్ధి చేస్తానన్నారు. బీఆర్‌ఎస్ యువజన విభాగం మండల కోశాధికారిగా నారంవారిగూడెం గ్రామానికి చెందిన కుందవరపు శ్రీనివాసరావును ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు నియమించారు. పార్టీ నాయకులు యూఎస్ ప్రకాశ్‌రావు, జుజ్జూరు వెంకన్నబాబు, సత్యవరపు సంపూర్ణ, మందపాటి రాజమోహన్‌రెడ్డి, కాసాని చంద్రమోహన్, మోటూరి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

**బీఆర్‌ఎస్‌లో యువకుల చేరిక**

దమ్మపేట, నవంబర్ 1: దమ్మపేటకు చెందిన 20మంది యువకులు బుధవారం మండలంలోని తాటి సుబ్బన్నగూడెంలోగల ఎమ్మెల్యే నివాసంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే మెచ్చా గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ ప్రజాప్రతినిధులు–నాయకులు దారా మల్లికార్జునరావు, దారా యుగంధర్, యార్లగడ్డ బాబు, చిన్నంశెట్టి సత్యనారాయణ, అబ్దుల్ జిన్నా, రూపా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

**మామిళ్లవారిగూడెం గ్రామ కమిటీ ఎన్నిక**

అశ్వారావుపేట రూరల్, నవంబర్ 1: మండలంలోని మామిళ్లవారిగూడెం గ్రామ బీఆర్‌ఎస్ కమిటీని బుధవారం దమ్మపేట మండలంలోని తాటిసుబ్బన్నగూడెం గ్రామంలో ఎమ్మెల్యే ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఇంటి వద్ద జరిగిన సమావేశం ఎన్నుకుంది. అధ్యక్షుడిగా బరపాటి సత్యనారాయణ, కార్యదర్శిగా తాండ్ర యుగంధర్, ఉపాధ్యక్షుడిగా ఉప్పల రత్నాకర్, సహాయ కార్యదర్శిగా యాసం శ్రీను, కోశాధికారిగా ఎస్‌కె.రహమాన్, ఆర్గనైజర్‌గా మైదుకూరి నాగమహేశ్వరరావు ఎన్నికయ్యారు. ఈ కమిటీని ఎమ్మెల్యే అభినందించారు. ఎమ్మెల్యేను నూతన కమిటీ బాధ్యులు సన్మానించారు. నాయకులు కూరపాటి నరేష్, వనం బాబురావు, వీర్నాల బ్రహ్మం, మిండా శ్రీనివాసరావు, కూరపాటి వెంకటేశ్వరరావు, కోర్స ప్రతాప్, పొట్టా రాము, శింగలదేవి చిన్న సత్యనారాయణ, డాక్టర్ అజీజ్, సాగర్ పాల్గొన్నారు.

# ఆయిల్ ఇయర్ ప్రారంభం

దమ్మపేట రూరల్, నవంబర్ 1: నూతన ఆయిల్ ఇయర్ నవంబర్ 1న ప్రారంభమైంది. ఇది వచ్చే సంవత్సరం అక్టోబర్ 31 వరకు ఉంటుంది. గత ఆయిల్ ఇయర్ అక్టోబర్ 31తో ముగిసింది. గత సంవత్సరం పామాయిల్ గెలల నుంచి వచ్చే సగటు ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేట్(ఓఆర్ఆర్) స్వల్పంగా తగ్గింది. అప్పారావుపేట ఫ్యాక్టరీలో ఓఈఆర్ 19.32 శాతం వచ్చింది. దీని ఆధారంగానే రైతులకు టీఎస్ ఆయిల్ ఫెడ్ చెల్లింపులు జరిపింది. నూతన ఆయిల్ ఇయర్‌లో 19.02 శాతం ఓఈఆర్‌పై రైతులు పామాయిల్ గెలల ధర అందుకోనున్నారు. ఓఈఆర్ తగ్గినందున రైతులకు చెల్లించే ధర కూడా తగ్గనుంది.

**ఓఈఆర్ అంటే...**

గడిచిన ఆయిల్ సంవత్సరం(నవంబర్ 1, 2021– అక్టోబర్ 31, 2022)లో 2.64 లక్షల టన్నుల పామాయిల్ గెలలను ప్రాసెస్ చేయగా 19.32 శాతం ఓఈఆర్ వచ్చింది. అంటే, ఒక టన్ను పామాయిల్ గెలల నుంచి 193.2 కేజీల క్రూడ్ పామాయిల్ వచ్చినట్లు. మంగళవారంతో ముగిసిన ఆయిల్ ఇయర్‌లో ఒక టన్ను పామాయిల్ గెలల నుంచి 190.02 కేజీల క్రూడ్ పామాయిల్‌పై ధర చెల్లిస్తారు. దీని ప్రకారమే క్రూడ్ ఆయిల్ అమ్మగా వచ్చిన డబ్బులో 75.25 శాతాన్ని రైతులకు, 24.75 శాతం ప్రాసెసర్ అయిన టీఎస్ ఆయిల్‌ఫెడ్‌కు చెందుతుంది. దీంతోపాటు పామయిల్ గింజల ధరలో 10 శాతాన్ని కూడా రైతులకు చెల్లిస్తారు. అక్టోబర్ 31తో ముగిసిన ఆయిల్ ఇయర్‌లో అప్పారావుపేటలో 19.02 శాతం, అశ్వారావుపేటలో 18.85 శాతం ఓఈఆర్ వచ్చింది. అత్యధిక ఓఈఆర్ వచ్చిన దాని ప్రాతిపదకనే ధర నిర్ణయిస్తారు. ఓఈఆర్ తగ్గడానికి వర్షాభావ పరిస్థితులు, లేత తోటల నుంచి వచ్చిన గెలల్లో తక్కువ ఆయిల్ శాతం ఉండటమే కారణమని ఆయిల్‌ఫెడ్ అధికారులు చెబుతున్నారు.

**లక్ష్యం చేరని పామాయిల్ గెలలు**

ఆయిల్‌ఫెడ్ నిర్ణయించుకున్న లక్ష్యానికి అనుగుణంగా అప్పారావుపేట, అశ్వారావుపేట ఫ్యాక్టరీలకు పామాయిల్



గెలలు రాలేదు. 2.9 లక్షల మెట్రిక్ టన్నుల పామాయిల్ గెలల లక్ష్యానికిగాను 2.7 లక్షల మెట్రిక్ టన్నుల గెలలు మాత్రమే వచ్చాయి.

## సుబాబుల్ కలప వేలం

అశ్వారావుపేట, నవంబర్ 1: స్థానిక ప్రభుత్వ ఉద్యాన పరిశోధన కేంద్రంలో సుబాబుల్ కలపను అధికారులు బుధవారం వేలం వేశారు. అశ్వారావుపేటకు చెందిన టి.సత్యనారాయణ రూ.1.86 లక్షలకు కైవసం చేసుకున్నారు. సంగారెడ్డి ఫల పరిశోధనా కేంద్రం సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ వి.సుచిత్ర, సైంటిస్ట్ డాక్టర్ పి.హరికాంత్, అశ్వారావుపేట హెచ్ఎస్ఎస్ హెడ్ సైంటిస్ట్ డాక్టర్ విజయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నాటు సారా స్వాధీనం

అశ్వారావుపేట, నవంబర్ 1: నాటు సారా తరలిస్తున్న ఇద్దరిని, ద్విచక్ర వాహనాన్ని ఎక్సైజ్ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన డేరంగుల కృష్ణ, గోరం సంధ్య కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వేలేరుపాడు మండలం నుంచి 30 లీటర్ల నాటు సారాను బైక్‌పై బుధవారం తరలిస్తున్నారు. వారిని ఎక్సైజ్ సీఐ కె.నాగయ్య, ఎస్సైలు కె.రాజేశ్వరరావు, సిహెచ్.శ్రీహరిరావు, సిబ్బంది తిరుపతి, భరత్, లావణ్య కలిసి పట్టుకున్నారు. బైక్ స్వాధీనపర్చుకున్నారు. కేసు నమోదు చేశారు.

## ఎన్‌డీ అమరవీరుల సంస్మరణ సభ

చండ్రుగొండ, నవంబర్ 1: మండలంలోని గుర్రాయిగూడెంలో బుధవారం న్యూడెమోక్రసీ అమరవీరుల సంస్మరణ సభ జరిగింది. నాయకులు ఎస్‌కె.ఉమర్, తేజావత్ భీముడు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులపైనే విద్యార్థుల భవిత

వేంసూరు, నవంబర్ 1: విద్యార్థుల భవిష్యత్ ఉపాధ్యాయులపై ఆధారపడి ఉంటుందని జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర్‌శర్మ అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. పదో తరగతిలో నూరు శాతం ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. ఎంఈవో వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం సుధాకర్‌రెడ్డి, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

సత్తుపల్లి రూరల్, నవంబర్ 1: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెట్టిన ఉన్నతి లక్ష్యపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఈవో సోమశేఖరశర్మ అన్నారు. సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి మండలాల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో బుధవారం నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. నోడల్ అధికారి నక్కా రాజేశ్వరరావు, వేంసూరు ఎంఈవో వెంకటేశ్వరరావు, హెచ్‌ఎంలు జయరాజు, యాకోబు, నాగేశ్వరరావు, శైలకుమారి, నాగమణి, సుధాకర్‌రెడ్డి, సత్యనారాయణ, మోహనరావు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ నాయకుల ప్రచారం

పెనుబల్లి, నవంబర్ 1 : సత్తుపల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య గెలుపు కోరుతూ మండల పరిధిలోని గణేశ్‌పాడులో నాయకులు బుధవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. సర్పంచ్ గోదా చెన్నారావు, నాయకులు పాల్గొన్నారు.



# సభల జోరు.. జన హోరు

- సత్తుపల్లి, ఇల్లెందు సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలు గ్రాండ్ సక్సెస్
- సభలకు లక్షలాదిగా తరలివచ్చిన ప్రజలు
- గులాబీమయంగా రెండు పట్టణాలు
- పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపిన కేసీఆర్ పర్యటన

ఖమ్మం, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): అభిమానం ఉవ్వెత్తున ఎగిసింది.. జనప్రవాహం కదిలింది.. ఖమ్మం జిల్లాలోని కల్లూరు, భద్రాద్రి జిల్లాలోని ఇల్లెందులో జరిగిన బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజాఆశీర్వాద సభలు జన సునామీలను తలపించాయి. సభలకు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి లక్షలాదిగా జనం తరలివచ్చారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా జన నేతను చూసేందుకు వేచి ఉన్నారు. సభా ప్రాంగణంలో సెల్ఫీలు తీసుకుంటూ యువతీ యువకులు సందడి చేశారు. 'జై కేసీఆర్.. జై జై కేసీఆర్' నినాదాలతో సభా ప్రాంగణాలు దద్దరిల్లాయి. సీఎం కేసీఆర్ రాక బీఆర్‌ఎస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. కేసీఆర్ అధినేత ప్రసంగానికి ప్రజలు హర్షధ్వానాలతో జైకొట్టారు. తొమ్మిదిన్నరేండ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వివరిస్తుండగా ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుల వ్యవహార శైలిపై పరోక్షంగా ముఖ్యమంత్రి సంధించిన వాగ్బాణాలకు ప్రజలు పెద్దఎత్తున స్పందించారు. సత్తుపల్లి నియోజకవర్గానికి చెందిన ప్రతి ఎస్సీ కుటుంబానికి దళితబంధు ఇస్తానని, పథకం ఇచ్చేరోజు తానే స్వయంగా సత్తుపల్లికి వస్తానని ప్రకటించినప్పుడు సభికులు కరతాళ ధ్వనులతో హర్షం వ్యక్తం చేశారు. ఇల్లెందులో ప్రజాగాయకుడు ఏపూరి సోమన్న, సత్తుపల్లిలో ప్రజాగాయని మధుప్రియ బృందం ధూం ధాం సభికులను ఉర్రూతలూగించింది. సత్తుపల్లిలో గులాబీ జెండాపై మధుప్రియ పాడిన పాటకు రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, సత్తుపల్లి శాసనసభ్యుడు సండ్ర వెంకటవీరయ్య నృత్యం చేసి సభికులను ఉత్సాహపరిచారు.

## యూనియన్ బ్యాంక్ సేవలపై కళాజాత



ప్రదర్శన ఇస్తున్న కళాజాత బృందం

అశ్వారావుపేట రూరల్, నవంబర్ 1: యూనియన్ బ్యాంక్ సేవలపై మండలంలోని వినాయకపురం బ్రాంచ్ అధికారుల ఆధ్వర్యంలో ఆసుపాక గ్రామంలో కళాజాత బృందం బుధవారం సాంస్కృతిక ప్రదర్శనలిచ్చింది. సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్, గోల్డ్ లోన్, వ్యవసాయ రుణాలపై అవగాహన కల్పించింది. కళాజాత బృందం సభ్యులు వై.శ్రీనివాస్, సురేంద్ర, వై.బ్రహ్మయ్య, గిరిబాబు, పసుపులేటి రాము, సర్పంచ్ కె.లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సభకు తరలిన బీఆర్‌ఎస్ శ్రేణులు

చండ్రుగొండ, నవంబర్ 1: కల్లూరులో సీఎం కేసీఆర్ ప్రజాశీర్వాద సభకు చండ్రుగొండ మండలం నుంచి బీఆర్‌ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మండలంలోని 14 పంచాయతీల నుంచి పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు వెళ్లారు.